# అంగారక సింగారం (సైన్స్ ఫిక్షన్)

-శ్రీకాశ్యప

**అ**న్ని ఆరోగ్య పరీక్షలు జరిగిన తర్వాత నేను స్ట్రెచ్చర్ లాంటి ఒక తోపుడు బండిలో ఉంచబడ్డాను. యంత్ర సహాయంతో ఉపగ్రహంలోకి చేర్చబడ్డాను. ఆ బండి ఆరు చక్రాల వాహనం. దాని పేరు "మజిలీ నౌక" అని ఉపగ్రహం పేరు మార్గదర్శి అని తెలిసింది. నేను ఉపగ్రహంలో చేర్చబడ్డాక అడుగున ఉన్న దబ్బాలు పేల్చబడ్డాయి. నాకేమీ తెలియడంలేదు. కాని ఆకాశంలోకి వెళుతున్న అనుభూతి పొందాను. ఇంతలో ఆహారవు సంచి నుంచి "బిస్కెట్ జెల్లీ"ని బయటకు తీశాను. కాని అది చేయిజారింది. కిందపడి ఉంటుందేమోనని తొంగి చూశాను. అది కిందపడలేదు సరికదా విష్ణుచక్రంలా నన్ను వెంటాడింది.

కొంతకాలం అలా ప్రయాణించిన తర్వాత ఒక గ్రహానికి చేరువయ్యాను. నా ఉపగ్రహం ఆ గ్రహం చుట్టూ తిరగడం మొదలుపెట్టింది. అప్పటికి గాని నన్ను వెంబడించిన బిస్కెట్ జెల్లీ నన్ను వదలలేదు.

ఆ గ్రహం ఉత్తర ప్రాంతంలో ఎఱ్ఱటి కాంతి - దక్షిణ ప్రాంతంలో మాచికలు వేసిన వస్త్రంలాగా బూడిదరంగు కనిపించింది. మొత్తానికి అరుణిమలు చిందిస్తోంది ఆ గ్రహం. ఆ గోళంపైని కాలువలు సాలెగూడెలోని దారాల్లా- బీటలువారిన దేహంతో ఆ గ్రహం వెలవెలబోతున్నట్టుంది.

దిగాల్సిన గమ్యం సమీపిస్తున్న కొద్దీ బ్రహ్మాండమైన వేగంతో ప్రయాణిస్తున్నది మార్గదర్శి. దిగే వ్యవధి తక్కువైంది. గ్రహాన్ని ఢీకొంటుందేమోనన్న భయం కలిగింది. ఇంతలో ఇంజన్లో నుంచి కొన్ని శబ్దాలు వినిపించాయి. ఏమనుకొందో ఏమో మార్గదర్శి విమానం బాగా వేగం తగ్గించింది. ఆ తర్వాత గ్రహంపై దిగింది. మజిలీ నౌక ప్రధాన నౌక నుంచి విడిపోయింది. దానిలో ఎక్కి ఉన్న నేను కూడ బయటకు వచ్చాను.

ఆ వింత గ్రహంపై మా మజిలీ నౌక నెమ్మదిగా ప్రయాణం చేయసాగింది. నీలి బూడిదరంగులు కలిగిన శిలలు కనిపిస్తున్నాయి. ఇంతలో మా బుల్లి బండి ఒక చిన్న రాతిపైకెక్కింది. నేను ఊపిరి బిగబట్టి కూర్చున్నాను. కాని దైవఘటనతో బండి బోల్తా పడకుండా చిన్న కుదుపుతో ప్రమాదం తప్పించుకొంది. ఆ కుదుపునకు పట్టుతప్పిన నేను మాత్రం విసురుకుని దూరంగా పడ్డాను. తల దిమ్మెక్కింది. కళ్ళు తెరచి చూచేటప్పటికి నేనొక వింత పురుషుని చెంత పడి ఉన్నాను.

అతని రూపం చూస్తే యోగిలా ఉన్నాడు. శరీరం ఆకుపచ్చ రంగుతో అందంగా మెరిసిపోతోంది. ఆప్యాయంగా నా తల నిమిరాడు. నాకు ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్లు అనిపించింది. యాంత్రికంగా నమస్కరించారు.

"వత్సా! నీవేగ్రహం నుంచి వస్తున్నావు?" అన్నాడు.

"భూలోకం" అన్నాను.

అతనే భాష మాట్లాడుతున్నాడో- నేనెలా జవాబిస్తున్నానో- ఆశ్చర్యంగా ఉంది. బహుశః అతని భాషలోని మనోభావం నా మెదడుకు చేరి- భాషాంతరీకబడి నాకు అవగతమగుతున్నట్టుంది. అదేలా నేనిచ్చే జవాబులు కూడా అదే ప్రక్రియలో అతనికి అందజేయబడుతున్నట్లు ఊహించాను.

"ఇది అంగారక లోకం" అన్నాడు వింత వ్యక్తి అప్రయత్నంగా.

"ధరణీ గర్భ సంజాతం, విద్యుత్కాంతి సమప్రభం
కుమారం శక్తి హస్తంతం, మంగళం ప్రణమామ్యహం॥"

అని చేతులు జోడించి ఆ గ్రహ ఉపరితలంపై సాష్టాంగ ప్రమాణం చేశాను. లేచి నడుస్తాననుకొన్న నాకు నా బరువులో దాదావు సగానికి పైగా కోల్పోయినట్లు తెలుసుకున్నాను.

"వత్సా! నీవు వచ్చిన పని?" అడిగాడు.

''మా లోకం నుంచి ఇతర గ్రహాలకు విహారయాత్రలు సాగిస్తుంటాము. అంగారకుడు భూగ్రహానికి పుత్రుడని మా పురాణాలు ఘోషిస్తున్నాయి. ఈ గ్రహం మా లోకానికి సమీపంగా ఉండడమే గాకుండా భూగోళ పరిస్థితులలో ఎక్కువ పోలికలు కలిగి ఉంటాయని మా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. మా లోకవాసులు ఈ మధ్యనే చంద్రమండలంపై కూడా కాలూనారు" అన్నాను.

"అలాగా!" అని బవిరి గడ్డంపై చేయివేసి సందేహంగా "నీవు గూఢచారివి కాదు కదా!" అన్నాడు.

"క్షమించండి! నేనొక పర్యాటకుణ్ణి మాత్రమే. మీ మండలంలోని విశేషాలను మా శాస్త్రజ్ఞులు ఊహించి చెబుతుంటే 'పోవలయు చూడవలెనని నూర్పుల నిగుడుచ్చు'వాడను. ఆ ఉత్సాహమే నన్నిక్కడికి చేరవేసింది. నేను భూగోళం చేరిన వెనుక ఈ గ్రహం గొప్పతనాన్ని మా శాస్త్రజ్ఞులకు విన్నవిస్తాను" అని నమ్మబలికాను.

"మా గ్రహం యుద్ధదేవత అని మీ లోకాన్ని సమీపించినపుడు యుద్ధాలు జరుగుతాయని నమ్ముతారట నిజమేనా?"

"అది కేవలం అపోహ మాత్రమే. కాకతాళీయంగా ఒకవేళ యుద్ధం జరిగియుండవచ్చునేమో! తల్లి చెంతకు బిడ్డ చేరడం సహజమే కదా! మీ గ్రహాన్ని గురించి మరిన్ని విశేషాలు దయచేసి తెలియజేయండి" అన్నాను వినయంగా.

"సరే! ఇలా కూర్చో. భూమికి అతి దగ్గరలోనున్న గ్రహం అంగారకుడు. ఇది భూమికంటే చిన్నదై, భూమి నుంచి చూసేవారికి ఎఱ్ఱని రంగులో నిప్పులా కనిపిస్తుంది. కాబట్టి మీవారు 'అంగారకుడు' అన్నారు. భూమి బరువులో పదోవంతు మాత్రమే దీని బరువు. ఇక్కడ ఒకరోజు పొడవు దాదాపు మీ రోజుకు లాగే ఉన్నప్పటికి సంవత్సరం మాత్రం మీ సంవత్సరానికి రెట్టింపు. మీ కాలమానం ప్రకారం పదహైదు నుండి పదిహేడు సంవత్సరాల కొకసారి భూ గ్రహానికి చాల చేరువగ వచ్చినపుడు దీని కాంతి ఇప్పటికన్న ఇరవై యైదు రెట్లుంటుంది" అన్నాడు.

"తల్లిని దర్శించిన సంతోషంలో ముఖకాంతి ప్రజ్వలిస్తుంది కాబోలు. బహుశః ఈ కారణంతోనే "భూమిపుత్రు"డని మా గ్రహవాసులు పిలుస్తారు."

"ఈ పుణ్యమూర్తిని యుద్ధదేవతగా అభివర్ణించారు కానీ ఇతనికున్న ఇద్దరు కుమారులలో చిన్నవానికి 'భీతి' (ఫోబోస్) అని, పెద్దవానికి 'అతిభీతి' (డీమోస్) అని పేర్లు పెట్టారు. నిజానికి వీరిద్దరు తండ్రికి బాసటగా తిరుగుతుంటారు. విచిత్రమేమిటంటే పెద్దవాడు తండ్రి ననుసరించి తిరిగితే చిన్నవాడు తండ్రికి ఎదురు ముఖంగా దినంలో నాలుగుసార్లు ప్రదక్షిణం చేస్తాడు. ఈవిధంగా అన్నదమ్ములిద్దరూ తండ్రి క్షేమానికి మిక్కిలి పాటుపడుతున్నారు.

భూగోళం మాత్రమే అందాల నిలయమని మురిసిపోవద్దు. అంగారకుడు సైతం ఒకప్పుడు అంతకు మించిన అందాలతో విరజిల్లినవాడే. గలగల పారే సెలయేళ్ళు, తివాసీ పరచినట్లుండే పచ్చని పచ్చిక బయళ్ళు చిరుగాలికి అందంగా, లయబద్ధంగా తలలూపే వృష్పజాతి వృక్షాలతో సౌందర్యంగా వెల్లివిరిసినదే. సతత హరిత వనాలు కనువిందు చేసినవే. సగటున కోటి సంవత్సరాల కొకసారి అంతరిక్షంలోని బలమైన ఉల్కల దాడులు సంభవించేవట. దాంతో వాయుపీడనం సన్నగిల్లింది. అంగారక గ్రహానికున్న అయస్కాంత శక్తి – ఆ గ్రహ వాతావరణాన్ని సూర్యుని నుంచి వెలువడే విద్యుత్ అయస్కాంత రేణువుల ప్రభంజనం (సోలార్ విండ్) నుంచి కాపాడలేకపోయింది. అందుచేత సూర్యరశ్మిని జీవరాశికి అనుకూలంగా మార్చుకునే శక్తిని కోల్పోయింది. దాంతో నీరు ఇంకిపోయి పచ్చదనం కనుమరుగై పోయింది. ప్రస్తుతం నెలకొన్న వాతావరణం దీన్ని ఎడారిగా మార్చింది. ఇప్పుడు నీవు దిగిన చోటును 'నిస్సార లోయ' (అరిస్ పాలిస్) అని అంటారు. ఇక్కడకు దగ్గరలో జంట శిఖరాలని ఉన్నాయి. అక్కడ నీలి, బూడిద రంగులు కలసిన శిలలు మిక్కుటంగా ఉంటాయి. ఇవన్నీ ఒకప్పుడు ఉల్కాపాతానికి బలియై అలా తయారైనవే. భూగోళంపై నెలకొని ఉన్నట్టు జీవరాశులకు అనువైన వాతావరణం అణగారిపోయింది. అనుకూల భౌతిక స్థితి కరువై పోయింది.

"అనుకూల భౌతిక స్థితి ఉంటే జీవరాశి ఉంటుందంటారా?" ప్రశ్నించాను.

"చెప్పలేము. కాని ఆ స్థితి లేనిచోట్లలో మాత్రం జీవరాశి అస్తిత్వత ఉండదని ఖచ్చితంగా చెప్పగలం.

## ప్రియుడు - భర్త

పెళ్ళికి ముందు
కాళ్ళు
పెళ్ళి తర్వాత
జుట్టు
జీవితం
షడ్రుచుల
సమ్మేళనం
ఉగాది పచ్చడిలా...

–యలమర్తి అనూరాధ

జీవరాశి మెలగాలంటే సూర్యుని నుంచి సరియైన దూరం, సరియైన ఉష్ణోగ్రత కలిగి జీవనానికి సంబంధించిన నీరు ద్రవరూపంలో ఉండాలి. ఆ నీటిని తనలో దాచుకునే పరిమాణం ఉండాలి. ఈ పరిస్థితి భూగోళానికి పుష్కలంగా ఉన్నాయి.

అంగారకునిలో ఒకప్పుడు ఉండిన వాతావరణం ఉల్కాపాతాలతో నీరసించి పోయిందని ఇదివరకే చెప్పాను. కాని ఒక్క విషయం మాత్రం విస్మరించరాదు. ఇప్పుడు మనం సిద్ధాంతీకరించినదంతా భూగోళ వాతావరణాని ఆధారంగా చేసుకుని మాత్రమే. మిగిలిన గ్రహాల్లో ఆ వాతావరణానికి సరిపోయిన మరోరకం జీవరాశి ఉండవచ్చు. ఇదంతా భగవంతుని లీల!" అని ముగించాడు యోగి.

"స్వామీ! ఇన్ని విషయాలు తెలిసిన మీ వయసును గూర్చి మొదట ఆలోచించాలి. తర్వాత మీ శాస్త్ర పరిజ్ఞానం..." అని సందేహంగా అడిగాను.

"మా గ్రహాన్ని ఉల్కలు ఎక్కువ శక్తితో ఢీకొన్నప్పుడు ఉద్భవించిన అత్యుష్ణానికి నీరంతా ఆవిరైపోయింది. ఆ వాతావరణంలో జీవరాశులన్నీ భస్మీపటలమై పోయాయి. మా తల్లిదండ్రులు కూడ చనిపోయారు. ఆకలికి ఆకులలములు వెతుక్కొంటూ వెళుతుండగా చాలా రోజులకొకనాటికి ఒక మొక్కను చూశాను. జిల్లేడు చెట్టులాంటి ఆ మొక్కకు ఆకులు పచ్చవిగను, మూలం పచ్చిగను కనుపించాయి. ఉల్కాపాతం తర్వాత కూడ జీవాన్ని సంతరించుకున్న ఆ చెట్టు ఉనికి ఆశ్చర్యాన్ని కలుగజేసింది. ఆకలి బాధకు తట్టుకోలేని నేను ఆ చెట్టు ఆకులను వేళ్ళను భోంచేశాను. ఆ తర్వాత ఎంత కాలం నిద్రపోయానో అర్థం కాలేదు. నిద్ర లేచేసరికి– ఆకలి దప్పులు లేకుండా పోవడమే గాక కొన్ని అతీంద్రియశక్తులు నాలో చోటుచేసు కున్నాయి. పూర్వజ్ఞానం కలిగింది. ఈ గ్రహానికంతా నేనొక్కడనే మిగిలాను. ఒంటరి జీవితంతో విసుగెత్తి పోయాను" అన్నాడు నిర్వేదంగా.

"పోనీ! మీరు మా లోకానికి రాకూడదూ!" అభ్యర్థించాను.

"రావాలనే ఉంది. కాని ఆ వాతావరణానికి నేను జీవించగలనా?" అన్నాడు సందేహిస్తూ.

"సాధారణ భూలోక వాసిని నేనే ఇక్కడికి రాగలిగి మీలా సంచరిస్తున్నప్పుడు అతీంద్రియశక్తులు గలిగిన మీరు మా గ్రహానికి రాలేకపోతారా? అక్కడ మనలేకపోతారా? పైగా ఏ గ్రహంలోని వాతావరణాన్ని అయినా కృత్రిమంగా సృష్టించి గ్రహాంతరవాసుల్ని రక్షించుకోగల శక్తి మా గ్రహంలోని అంతరిక్ష కేంద్రానికి ఉంది. చిరంజీవియైన మిమ్మల్ని ఆప్యాయంగా చూసుకుంటారు" అన్నాను వినయంగా.

కాసేపాలోచించి "ఏదో అతీత శక్తి నన్నడ్డగిస్తోంది నన్నిక్కడే అంతం కానీ" అన్నాడు నిరుత్సాహంగా.

"పరిహార మార్గం లేదా?" అన్నాను.

"తప్పదు" అన్నాడు దృఢంగా.

"పోనీ! మీకున్న అతీంద్రియ శక్తిని నాకు ప్రసాదించగలరా?" ఆశగా అడిగాను.

"నేర్చుకోవాలన్న శ్రద్ధ ఉంటే నేర్పుతాను. ఇది ఆషామాషీ వ్యవహారం మాత్రం కాదు" అని గంభీర స్వరంతో చెప్పాడు.

స్థిరంగా పద్మాసనం వేసుకొన్నాను. ఏవేవో మంత్రాలు చదివి నా నెత్తిన చెయ్యి నుంచాడు. తల తిరిగినట్టైంది.

## చిత్తు ప్రశ్న

భిన్న వర్గాలుగా చెదిరిపోయినా
ఈ గడ్డపై పుట్టిన బిడ్డల మని
ఆరు దశాబ్దాలకాలం కరిగిపోయినా
కాలం చెప్పే తీర్పుకోసం ఎదురుచూస్తూ
సహనశీలురు, సాహసవంతుల సంతతి
బాల్యంలోనే మేధస్సుకు శిలువవేస్తే
మట్టిలో మరుగుపడిన విలువలేని వర్గం
త్రవ్వితీసిన శిలాదజాల్లా
చరిత్రకు చెందని అవశేషాల్లా
వలస పక్షుల్లా రెక్కలు కట్టుకుని
ఎగిరిపోతున్న మన సంతతి అంటే ఎలా?
కసాయి కత్తుల మధ్య జీవించే కంటే
వలస బ్రతుకే నయమేమో
ఏదో ఎరవిసిరినా ఏం చెప్పినా
స్వాగత వచనాలు పెదవులు చిలికినా
త్యాగ ప్రవచనాలు పలికినా
వలలో పడే పక్షులు కావు సుమా!
సంపద సమాజ పరమని ప్రవచించినా
గమ్మత్తులు, కసరత్తులు, పై ఎత్తులు
చివరికి చిక్కువీడని చిత్తుప్రశ్నలే!!

–బెహరా ఉమామహేశ్వరరావు

"ఇప్పుడు నీకు నా శక్తిని ప్రసాదించాను. దీనిని సద్వినియోగం చేసుకో. భవిష్యత్తులో రెండు గ్రహాలవాసులకు అవగాహన ఏర్పడవచ్చు" అని ఆజ్ఞాపించాడు.

భస్మాసురుడికి కలిగిన సందేహం కలిగింది నాకు.

"నిజంగా ఇది ఫలిస్తుందా?" అని మనసులో అనుకున్నానో లేదో- అతడు నొసలు ముడిచి తల ఎగురవేశాడు.

నేను బాగా ఆలోచించి,

"ఒక్క నిముషం సేపు సూర్యచలనం ఆగిపోవాలి" అని కోరుకొని- కళ్ళు మూసుకొని గురువుగారు ఉపదేశించిన మంత్రాన్ని స్మరించాను. సూర్యచలనం ఒక్క నిముషం ఆగితే ఈ గ్రహానికేమి ప్రమాదం కలుగదు కదా. దూరంలో వెళ్ళే రైలు కాసేపాగితే ఎవరికీ నష్టం లేదుగదా అనే ధ్యాసతో.

## కనీ.. పెంచీ...
## కనిపించకుండా పోయావు!

అందరికీ నాన్నంటే ఒక నమ్మకం..
నాకు మూఢనమ్మకం... గాఢనమ్మకం...
కర్మాగారంలో ఉక్కు మర్మమెరిగి
ముక్కుపిండి దారిలోకి తెచ్చుకుంటూ
తుక్కు అణువుల్ని అరచేతిలో-
సుత్తిదెబ్బల్నీ గాయాల్నీ పాదాలకు
హత్తుకున్న విచిత్ర దేహం నీది...
నీది చాలీచాలని నెలసరి ఆర్జన...
ఐనా నీ పిలుపు సదా సింహగర్జన...
అగ్నిప్రమాదానికి అమ్మ ఆహుతైనప్పుడు
అవాక్కై మతిభ్రమించి తిరిగావు...
కనీపెంచి పెద్దచేసిన ఏకైక ఆసరావి...
హఠాత్తుగా కనిపించకుండా ఎటుపోయావో?...
సందులూ-కూడళ్ళూ-బస్సూ రైల్వేస్టేషన్లూ...
ఊరూవాడా పల్లే పట్టణాలూ జల్లెడించాను...
ఫలితం మిగిలింది ఎండమావిగా...
చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకై నీ 'శ్రమ'ని అమ్మేసాను...
నీ అదృశ్యానికి కోపించి జ్ఞాపకాల్ని చిదిమేసాను...
నీ ఆస్తిగా ఆత్మగౌరవాన్ని పదిలపరుచుకున్నాను..
నా బిడ్డకి నీ పేరుతో నిత్య నామస్మరణిస్తున్నాను!

-గుండాన జోగారావు

గ్రహ భ్రమణం ఆగిపోయింది. వెంటనే తుపాను చెలరేగింది. దుమ్ము ధూళితో గురువుగారు కిందికి మీదికి లేచి పడుతున్నారు. ఒక్క నిముషం ముందు ఎంతో ప్రశాంతతతో నిండిన గ్రహం ఒక్కసారిగా ఉరుములతో మెరుపులతో అతలాకుతలమై పోయింది. ఎక్కడో ఉల్కాపాతమైనట్టుంది. పైనుంచి రాళ్ళవర్షం కురుస్తోంది. గురువుగారి జాడ కనిపించలేదు గాని నేను మాత్రం ఈ ప్రమాదానికతీతంగా నిలిచి పోయాను.

"కొన్ని గ్రహ శకలాలు (ఆస్టరాయిడ్స్) రాతితో ఇనుముతో కూడి ఈ గ్రహానికి మధ్య ప్రాంతంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తుంటాయి. అవి అప్పు డప్పుడు ఒకదానికొకటి ఢీకొని చెల్లాచెదురవుతాయి. ఇలాంటి కొన్ని శకలాలు సమీపంలోని గ్రహాల గురుత్వాకర్షణ శక్తికి లోబడి తమ కక్ష్యను మార్చుకొని, సమీప గ్రహాలను ఢీకొని తుపాను సృష్టిస్తుంది. అదే ఇప్పుడు జరిగింది.

సూర్యుడు తిరిగినట్టు కనిపించినా నిజానికి తిరిగేది గ్రహమే కదా! అందుకే నీవు సూర్యచలనాన్ని నిలపాలంటే గ్రహ పరిభ్రమణమే నిలిచిపోయింది. పరిభ్రమణం నిలిచిపోయి ఆ శకలాలు మన గ్రహాన్ని తాకాయి. ఈ తుపానును సృష్టించాయి. ఈ పరిణామంతో నాలోని ఆర్ద్రత నశించింది. నేనిక జీవించలేను.

"అవశ్యమను భోక్తవ్యం
కృతం కర్మ శుభాశుభం"

మనం చేసే పనుల వలన జరిగే మంచి చెడ్డలను అనుభవించి తీరాలిగదా! అర్థంలేని ప్రయోగాలు అనర్థాలను సృష్టిస్తాయి. నీవు క్షేమంగా నీ గ్రహాన్ని చేరుకో" అన్న సందేశం వినవచ్చింది.

కడుపులో వికారమై రక్తం వాంతి చేసుకున్నాను. ఆ వాతావరణంలో దిక్కుతోచక "అమ్మా!" అని భయంకరంగా అరిచి కింద పడ్డాను.

❍ ❍ ❍

"వేణూ! ఏమిటా పలవరింతలు. రేయింబవళ్ళు వెధవ 'డిఫెక్టివ్' నవలలు చదవవద్దురా అని మొత్తు కుంటూనే ఉన్నా వింటేగా!" అని ముఖాన నీళ్ళు చల్లింది బామ్మ. ప్రశాంతంగా ఉన్న నా పరిసరాలను చూసి అవాక్కయ్యాను. ఇంతలోనే పైకి లేస్తూ "డిఫెక్టివ్ కాదు బామ్మా! 'డిటెక్టివ్' అని కడుపుబ్బ నవ్వుకొన్నాను జరిగింది తలుచుకుంటూ. ■